# అమ్ముల పొది

చాలా ఏళ్లకి వారంతా కలుసుకుంటున్నారు. ఒకే వూరిలో, ఒకేకాలేజీలో చదువుకున్న వారందరినీ ఒకచోట చేర్చారు ఆరోజు. ఓల్డ్ స్టూడెంట్స్ అన్నందుకు నిజంగానే వయస్సు పైబడిన వారే. 50-60 ఏళ్ల నుంచి, 90 ఏళ్ల వరకు గలపూర్వ విద్యార్థినీ విద్యార్థులున్నారు ఆ గుంపులో. మూడు వందలకు పైగానే ఆ హాలులో కోలాహలంగా కూర్చున్నారు. వందేళ్ల చరిత్ర వున్న ఆ కాలేజీకి అంత పేరు.

నెరసిన తలకాయలు, మందమైపోయిన కళ్లజోళ్లు, పెరిగిపోయిన స్థూలకాయాలు. కొన్ని దశాబ్దాల క్రితం తమ క్లాస్‌మేట్స్ అయినవారిని గుర్తించడానికి చాలామంది తాపత్రయపడుతున్నారు.

హేమసుందరి కూడా అందరిని కలుసుకుంటూ, పలకరిస్తూ, జ్ఞాపకాలు కలబోసుకుంటోంది. ఆమె ఐ.ఏ.ఎస్. ఆఫీసరు కావడాన అందరూ ఆమెను ప్రత్యేకంగా పలకరిస్తున్నారు. ప్రార్థన గీతాలు, కొన్ని భక్తి పాటలు వగైరాలు, పరిచయ వాక్యాలు అయిన తరువాత "అందరూ బ్రేక్‌ఫాస్ట్ కోసం పక్కన షామియానాలోకి వెళ్ళండి." అని అనౌన్స్ చేశారు.

సందడిగా కదిలింది గుంపు.

పెసరట్టు, ఉప్మాలు, అల్లం పచ్చడి అంటూ లిస్ట్ చెప్పి "ఇవన్నీ మన వూరి స్పెషాలిటీ. అందుకే తెప్పించాం" అని మరీ చెబుతున్నారు సమన్వయకర్తలు.

ఆరోజు జ్ఞాపకాల పుటలు తిప్పుకోవడమే కాక, గొప్ప గురువులకు సన్మానం కూడా ఏర్పాటు చేశారు. తమకు పాఠాలు చెప్పిన అభిమాన లెక్చరర్లను ఎన్నేళ్లకో చూసి నమస్కరించి తమ పేరు వగైరాలు చెప్పుకుంటున్నారు చాలామంది.

హేమసుందరితో మాట్లాడాలని చాలా మంది 'కుర్రాళ్ళు' కుతూహలపడుతున్నారు. వారిలో కొందరికి బట్ట తలలైతే, కొందరికి చేతి కర్ర లేనిదే అడుగు పడడం లేదు. 'మీరు మన కాలేజీ స్టూడెంటా?" అని ఒకరు అంటోంటే "ఔనండీ! చాలా ఫేమస్! నాలుగు సార్లు యూనివర్సిటీ ఫస్ట్. వాటిలో మూడు గోల్డ్ మెడల్స్!" అని యింకొకరు జవాబిస్తున్నారు.

ఆమెకి ఎవరో ప్లేట్ ఇచ్చారు. లడ్డూ, ఇతర అల్పాహార పదార్థాలు వడ్డించారు. వేళ్లతో సున్నితంగా ఇడ్లీ ముక్క తుంచుకుంది. బ్యాగ్ బరువు అనిపించి ఒక కుర్చీకి తగిలించింది. వీళ్లల్లో కొందరు ఆమెకి గుర్తే. ఎందుకంటే ఆమె కాలేజీ వదిలి నలభై ఏళ్లు మాత్రమే అయింది. ప్రతి క్లాసుకీ ఆమె దగ్గర గ్రూపు ఫోటోలున్నాయి. ఇప్పుడింక రిటైర్‌మెంట్‌కి సిద్ధమయ్యే వయస్సు.

ఉన్నట్లుండి తన ఎదురుగా నిలబడిన మనిషిని చూసి పక్కన వారితో మాటలు ఆపేసింది. "నమస్తే మేడమ్! హేమసుందరిగారిని ఎవ్వరూ మర్చిపోలేరు. నేను" అని ఆయన అంటూండగానే "మిమ్మల్ని కూడా మేము మరచిపోలేము. పేరు అవసరం లేదు" అంది హేమ.

ఆయన కిచకిచ నవ్వాడు. "నా అసలు పేరుకంటే మీరందరూ కలిపి పెట్టిన పేరు ఒకటుండేది. అదేమిటో..." అంటుండగానే మళ్ళీ హేమ అందుకుని "మేము సరదాకి అనుకునేవాళ్ళం గానీ ఎప్పుడూ నొప్పించే వాళ్లం కాము. అది ఇప్పుడు అనుకోవడం కూడా మర్యాద కాదు" అంది.

ఆయన అనవసరంగా మళ్లీ కిచకిచ నవ్వి "నన్ను బొంతకాకి అనేవారు కదూ?" అన్నాడు.

"ష్! అదంతా ఆనాటి మాట. ఇప్పుడు చెప్పండి. ఎలా వున్నారు. ఏం చేస్తున్నారు?" అని మాట మార్చింది. తనకి ఇతని గురువుగారెవరో తెలుసు కనక కోపం వుండేది అప్పట్లో.

"మీరు పెద్ద పొజిషన్లోకి వెళ్లారు. మిమ్మల్ని చూసి నవ్వి, ఎగతాళి చేసిన మేము ఏదో చిన్న ఉద్యోగాల్లో తేలి, రిటైరైనాము" అన్నాడు ఆయన. దూకుడు, వ్యంగ్యం పోయి దీనత్వం మాటల్లో.

"గతం గత: అనుకోకుండా మీరింకా ఆనాటి విషయాలు తవ్వి పోస్తారేమోనని భయంగా వుంది" అన్నాడు మళ్లీ.

"చెప్పలేం అప్పటి ఒకరి ప్రవర్తన వల్ల కలిగిన పరిణామాలు తలచుకుంటే ఇప్పటికీ మనస్సు చివుక్కుమనవచ్చును. మీఆరోగ్యం ఏమంత బాగా లేదనిపిస్తోంది నాకు. బాగున్నారా!" అంటూ సంభాషణను దారిలోకి తీసుకురావడానికి ప్రయత్నించింది. మధ్యలో ఎందరివో అభివాదాలు, పలకరింపులు జరుగుతున్నాయి.

"మేడమ్! ఇప్పుడు సమావేశం ఆరంభం కాగానే మీరు మాట్లాడాలి" అన్నాడు ఆర్గనైజర్ ఒకాయన.

"ఓయస్! నాకు పరమ పూజ్యులైన ఇద్దరు మన లెక్చరర్స్‌కి సన్మానం చేయాలని శాలువాలు కూడా తెచ్చాను. ఒకటి జానకిరామయ్య మాష్టారు. రెండోవారు గౌరీనాథంగారు" అంది హేమ. కన్వీనర్ గంగాధర్ ఆమోదంగా తల వూపాడు...

"వారిని చూస్తే అందరికి అలాగే అనిపిస్తుంది. ముందు మీరు సన్మానాలు చేస్తారు కదా? ఆ తర్వాత నేను స్టేజి మీదకు వచ్చి నా కానుకలు ఇస్తాను" అంది.

"మిమ్మల్ని ముందే పిలుస్తాం. పూర్వవిద్యార్థి కమిటీ తరఫున లెక్చరర్లు అందరికీ సన్మానాలు. ఫైనాన్స్ మినిష్టర్‌గారు మన కాలేజ్ ఓల్డ్ స్టూడెంట్ నాగార్జున విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, ఉస్మానియా హాస్పిటల్ సూపరింటెండెంట్ కూడా మన కాలేజి వాళ్లే. వారు ఇప్పుడు వస్తారు ముందో వెనకో, మీరు సరేసరి. మా అందరికి గర్వకారణం" హడావిడిగా చెప్పేసి స్టేజి మీదకు వెళ్లిపోయాడు గంగాథర్. మళ్లీ జనమంతా ఆడిటోరియంలోకి వచ్చారు.

సమావేశకర్త పెద్దలను పేరు పేరునా పిలుస్తున్నారు. పదహారు వరకు కుర్చీలు ముందు వరసలో, మరో ఇరవై వరకు వెనక వరుసలో వున్నాయి. "ఇదేమిటండీ, మన యూనియన్ కేబినెట్‌లాగ యిన్ని కుర్చీలు" అని ఒకాయన చమత్కరించాడు. అంతలో హేమను స్టేజి మీదకు పిలిచారు. ఆమె చిట్టచివరి కుర్చీలో కూర్చోబోతుంటే, ముందుకి పిలిచి ప్రముఖంగా కూర్చో బెట్టారు.

మంగళ వాయిద్యాలతో అధ్యాపకులకు సన్మానం ఆరంభమైంది. పండు పరకల తెల్లని తలకాయలు కొందరివైతే, రంగుతో నల్లబరుచుకున్న జుట్టుతో మెరుస్తూ కొందరు మాజీ గురువర్యులకు ఎంతో భక్తిగా సన్మానం చేస్తున్నారు. కాళ్లు కడిగి, నెత్తిన నీళ్లు జల్లుకోవడం ఒక్కటే తరువాయిగా వినయంతో సాష్టాంగ పడిపోతున్నారు. పాదాలు కళ్లకు అద్దుకుంటున్నారు.

కుంకుమ దిద్ది, పన్నీరు చిలకరించి,అత్తరు చేతికి పూసి, మెడలో పుష్పహారం వేసి ఎంతో పద్ధతిగా సన్మానాలు జరిపారు. సన్మానపత్రాలు చదివేందుకు దిట్టమైన కవితా ధోరణి వుండే మాజీ తెలుగు విద్యార్థులను ఏర్పాటు చేశారు.

మాష్టారులందరినీ చూస్తోంది హేమ. కొందరికి అప్పటికే ఆమె నమస్కారం పెట్టేసింది.ఆ చివరన కూర్చున్న లెక్చరర్ బాల కృష్ణమూర్తి. హేమ చూపు ఆయన మీద పడింది. తాను వచ్చినప్పటినుండీ ఆయనను గమనిస్తూనే వుంది. ఎందరో 'కుర్రాళ్ళు' యిందాకటి 'బొంతకాకి' నామధేయులు ఆయనకి వంగి దణ్ణాలు పెడతారు. ఎందుకంటే వారు ఆయనకి ప్రియ శిష్యులు.

బాలకృష్ణమూర్తిని చూడగానే తన మనస్సులో కలుక్కుమన్న వ్యక్తి రుక్మిణి. తన చిన్ననాటి ప్రియనేస్తం. ఆరో తరగతి నుంచి బి.ఏ.వరకు కలిసి చదువుకున్నారు.ఎంత స్నేహమో! గంటల తరబడి కబుర్లు చెప్పుకునేవారు గుడి మండపం పక్కన కూచుని, "ఒసే హేమా! నువ్వు చాలా తెలివైన దానివే. బాగా చదువుకొని పైకి రావాలే' అనేది. తమ చెట్టుకి కాసిన జామకాయలు తెచ్చి యిచ్చి, హేమ కొరుకుతుంటే "బాగున్నాయా? తియ్యగా వున్నాయా?" అని పూదరకొట్టేది. "పోవే, దేముదు చేసిన కాయలకు కూడా నీ సిఫారసు ఏమిటి?" అనేది హేమ.

ఒకరోజు రుక్మిణి ఏడుస్తోంది. "ఎందుకే?" అంటూ హేమ ఎంతో సేపు అడిగాక "నీకూ నాకూ స్నేహమేమిటని అందరూ నవ్వుతున్నారు" అంది.

హేమ తెల్లబోయింది.

"నువ్వేమో బంగారు బొమ్మలా అందంగా వుంటావు. నేను ఎలకపిల్లలా నల్లగా వుంటాను.నువ్వు ఎత్తు. నేను పొట్టి. మీకు డబ్బుంది. మాకు లేదు. నీకు అన్నీ ఫస్ట్ మార్కులు. నేను బొటాబొటీ పాస్" అంటూ ఏకరవు పెడుతోంటే, హేమ ఆమె భుజం మీద చెయ్యి వేసి దగ్గరగా తీసుకుంది.

"పోవే! ఎవరో ఏదో అన్నారని నువ్వు ఏడవడం ఏమిటి? అసలు చూడు, నీ బారెడు జడ నాకుందా?" అంటూ ఓదార్చింది.

బాలకృష్ణమూర్తి పేరుకి గురువేకానీ, ఎప్పుడూ జులాయి స్టూడెంట్స్‌తో తిరుగుతూ, సిగరెట్లు పీలుస్తూ ఏమాత్రం హోదా లేనట్లు చవుకబారుగా వుండేవాడు. ఐదారేళ్లక్రితమే సర్వీసులో చేరిన ఆయన విద్యార్థుల కంటే మహా అయితే ఒకపదేళ్ళు వయస్సులో పెద్దవాడు.

క్లాసులో పిచ్చి పిచ్చిగా అమ్మాయిల వంక చూస్తూ, మధ్యలో అనవసరమైన నవ్వులు విసురుతుండేవాడు. ఒకసారి ఏదో సందర్భంలో 'గోల్డ్' ప్రస్తావన వచ్చింది. "గోల్డ్ అంటే బంగారం. బంగారు బొమ్మ అంటుంటారు చూడండి. పసిడి అందాలు అంటారు. అల్లాగన్నమాట" అంటూ వాగుతూ హేమ వంక చూడడం, అది ఒక క్లూగా తీసుకొని అబ్బాయిలు పెద్దగా కూతలు, పాటలు.

అలాగే రుక్మిణి విషయంలో అసందర్భంగా "ఎలక తోలు తెచ్చి ఎన్నాళ్ళు ఉతికినా" అంటూ ఆయన దీర్ఘాలు తీయగానే "రుక్మిణి కృష్ణుడి సొంతమే" అంటూ కుర్రాళ్ళు పిచ్చి కేకలు. ఇది ముదిరి గోడల మీద పిచ్చి రాతలకు, హేమ, రుక్మిణి నడిచి వెడుతుంటే బూతు పాటలకు పెరిగిపోయింది. రుక్మిణి కాలేజీకి రావడం మానేసింది.ఎంత చెప్పినా వినలేదు. ఏడ్చి సొమ్మసిల్లిపోయేది.

హేమ ప్రిన్సిపాల్ దగ్గరికి వెళ్ళి కంప్లైంట్ రాసిచ్చింది. ఆయన విద్యార్థులెవరికో వార్నింగ్ యిచ్చారని అన్నారు. బాల కృష్ణమూర్తి కమిటీకి యిష్టమైన మనిషి. ఆయన మీద పెద్ద చర్య తీసుకునే ఉద్దేశ్యం ఎవరికీ లేదు.

ఏమైతేనేం రుక్మిణి అన్నయ్యలు ఆమెను కాలేజి మాన్పించి, విజయనగరానికో ఎక్కడికో తీసుకెళ్ళారు. చదువు మాన్పించేశారు. అందుకు ముఖ్య కారణం బాలకృష్ణమూర్తి ప్రేరణతో

'బొంతకాకిగాడు, మరో ఇద్దరు కలిసి ఒకరోజు సందులో రుక్మిణిని పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించారు. భీతిల్లిపోయి, ముడుచుకుపోయే ఆపిల్లంటే చులకన. ఆ విషయం నలుగురికి తెలిసిపోయింది.

రుక్మిణి ఏడుపు చూసి అది ఏమైనా మింగుతుందేమోనని హేమకి చాలా భయం వేసింది. అంతకంటే అది ప్రాణాలతో వూరు విడిచి వెళ్ళడమే నయమనిపించింది.

ఇదంతా జరిగి నలభై రెండేళ్లయినా అప్పుడు గడచిన ప్రతి ఒక్క రోజు హేమకి గుర్తుంది. శీతాకాలం సాయంకాలం ఎండలో కాలేజీ బిల్డింగ్‌నీడలు పొడుగ్గా, నేల మీద చీకటి పరుస్తోంటే, తన భుజం మీదచేయి వేసి, నడిచే ఆ అమాయకురాలు గుర్తుకొచ్చి దు:ఖం వచ్చేది. హేమ ఫస్ట్ క్లాసులో పాసైంది. ఆ తర్వాత ఎం.ఏ. ఐ.ఏ.ఎస్ సెలక్షన్ అయినాయి.

హేమనీ చాలా అల్లరి పెట్టారు. ఇంకు చల్లి సైకిల్ మీద పారిపోవడం, గ్రౌండ్‌లో స్పీడ్‌గా వచ్చి డేష్ యివ్వడం. ఇంకా ఎన్నో వెకిలి చేష్టలు, చెంపదెబ్బ లేద్దామన్నా, చెప్పు తీద్దామన్నా మనిషి దొరక్కపోవడం. ఫిర్యాదు చేసినా చివరి వరకు అది సాధించేందుకు వీలు లేకుండా పరీక్షలు, సెలవులు. నాన్నగానీ, అన్నయ్యలు గానీ లేకుండా వంటరిగా అమ్మతో వుంటుండే హేమకి వీటి గురించి టైమ్ లేదు.

'హేమసుందరిగారిని మాట్లాడమని కోరుతున్నాం' అంటున్నారు. ఆమె లేచి, తన బ్యాగ్‌లో నుంచి శాలువాలు, వివేకానంద, బుద్ధబొమ్మలు తీసి, పళ్లు తాంబూలం పెట్టి, తను 'గురువు, దైవం' అనుకున్నవారు ఇద్దరికీ యిచ్చి దణ్ణం పెట్టింది. మిగిలిన లెక్చెరర్లలో కొందరికి కూడా నమస్కరించింది. బాల కృష్ణమూర్తిని మాత్రం పట్టించుకోకుండా మైక్ దగ్గరకు వెళ్లింది.

తన జ్ఞాపకాలు, అనుభవాలు, తన వ్యక్తిత్వానికి పునాది వేస్తూ, గురువులు చెప్పిన విషయాలు గుర్తు చేసుకుంటూ అనర్గళంగా ఉపన్యసించింది. "ఓం మంగళం గురుదేవాయ, మహనీయ గుణాత్మనే, సర్వలోక శరణ్యాయ, సాధురూపాయ మంగళం" అని రాగయుక్తంగా ఆమె ఆలపించేసరికి హాలులో ప్రతి ఒక్కరూ చప్పట్లు కొట్టారు.

ఆ తర్వాత ఒక్క క్షణం నిశ్శబ్దం. "ప్రతి మధుర గీతంలోను ఒక అపశృతి ఉంటుంది. నందనవనంలోనైనా ఒక ముళ్ల పొద వుంటుంది. చెయ్యెత్తి మొక్కవలసిన గురు సమ్ముఖంలో చెంపదెబ్బ కొట్టాలన్న బలమైన కోరిక కలగడం ఎంతో అసహజం, దురదృష్టకరం!

తరతరాల గురువులకి నా విజ్ఞప్తి. కుళ్లిపోయిన ఆలోచనలతో అధ్యాపక వృత్తిలోకి రాకండి. సంస్కారం లేని మీ మాటలు, మీ చేతలు విద్యార్థుల్లో కీచక, దుశ్శాసన స్వభావాలను ప్రకోపింపచేస్తాయని గుర్తించండి. పని కట్టుకొని మీరు విద్యార్థులను ప్రేరేపించి, కేవలం మీ కాలక్షేపం కోసం వారిని రెచ్చగొట్టి విద్యార్థినులపైకి

ఉసిగొల్పితే కొందరి బ్రతుకులు దుర్భరమౌతాయని తెలుసుకోండి. శాశ్వతంగా వారు చదువుకీ, కాలేజీకి దూరమై, ఆత్మ విశ్వాసం దెబ్బతిని, జీవితాంతం చితికిన వ్యక్తిత్వాలతో వుండిపోతారు. విద్యాలయం అసభ్య, అశ్లీల నిలయంగా మారితే అందుకు బాధ్యులు జులాయి విద్యార్థులకంటే కూడా బాధ్యత లేని దుర్మార్గ మాష్టార్లే అని గుర్తించండి. ఒక విద్యార్థిని పాలిటి నరకంగా క్లాసరూమ్ మారితే, ఆమె బతుకు పెడదారి పడితే, ఆ పాపం లెక్చరర్‌దే" అంటూ పక్కకి తిరిగి బాల కృష్ణమూర్తి వంక సూటిగా చూసింది.

హాలు మొత్తం నిశ్శబ్దం. "మరో జన్మంటూ వుంటే!... తప్పక వుంటుంది. దుష్టాత్ములకు అంత త్వరగా జన్మరాహిత్యం దొరకదు. ఆ జన్మలోనైనా పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలోకి రాకుండా రౌడీ వృత్తిలోకి వెళ్లిపోవడం మంచిది. ఇప్పటికైనా ఆరోజులు తలచుకోండి. కొంచెమన్నా మీ అంతరాత్మ మేల్కొంటుందేమో చూడండి. కన్నబిడ్డల వంటి విద్యార్థినులను, ముఖ్యంగా ఒకానొక లేత మొగ్గను ఎలా మంటలు అంటించి, మసి పూసి తరిమి కొట్టారో జ్ఞప్తికి తెచ్చుకోండి. ఇందరిలో, యింతమందిలో నాకు కనుపించని, నా కళ్లల్లో

మెదులుతున్న నా ప్రియ స్నేహితురానిని తలచుకుంటున్నాను" అని కంఠం పూడుకొని పోగా, కళ్లల్లోకి కమ్ముతున్న కన్నీరుతో హేమ తన ఉపన్యాసం ముగించింది.

నిశ్చేష్టులై, రెప్పార్పకుండా చూస్తున్న జనంలో కొన్ని ముఖాలు వివర్ణమైనాయి. ఎక్కడో, ఎప్పుడో వదిలేసిన జ్ఞాపకాలు వచ్చి బాణాల్లా గుచ్చుకొని, తమ తప్పులను గుర్తు చేస్తుంటే వారు తలలు వంచుకున్నారు.

అనర్గళమైన ఉపన్యాసం విని, చప్పట్లు కొట్టడానికి జంకిన మిగిలినవారు, బాలకృష్ణమూర్తి వైపే చూస్తున్నారు. వారి చూపులే పదునైన బాకులైతే, ఆయన శరీరం తూట్లు పడేది.